క్లుప్తంగా

'ఎంజేపీ' ప్రిన్సిపాల్‌గా ఓదెల మల్లయ్య



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) బాలుర గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్‌గా ఓదెల మల్లయ్య శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కమలాపురం గురుకుల విద్యాలయంలో సేవలందించిన ఆయన ఇక్కడికి ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన కురోజు దేవేందర్, ఉపాధ్యాయులు మల్లయ్యను అభినందించారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా..



పర్వతగిరి : మండలంలోని ఆదర్శ పాఠశాల, కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పీవీవీ.గణేశ్‌కుమార్ నోడల్ ఆఫీసర్ జి.లింగారెడ్డి సమక్షంలో శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు పని చేసిన ప్రిన్సిపల్ పి.శ్రీదేవి ఆర్నెల్లపాటు విదేశాలకు వెళ్లిన క్రమంలో ఆమె స్థానంలో గణేశ్‌కుమార్‌కు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గణేశ్‌కుమార్‌కు ఎంఎల్‌సీ కోఆర్డినేటర్ జయరాజు, ఉపాధ్యాయులు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పరామర్శ

నర్సంపేట : కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోగా ఆస్పత్రిలో ఆయన్ను ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బొబ్బాల రమణారెడ్డి, ఎంపీటీసీ చీకటి స్వరూప ఓదెలు, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు వేముల సారంగం, పట్టణ సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు..

నర్సంపేట : పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ కడారి సత్యనారాయణను అతడి సతీమణి ఇందిర, 13వ వార్డులో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగానికి చెందిన పిన్నా భాస్కర్‌ను అతడి నాయనమ్మ సుశీల ఇటీవల మృతి చెందిన క్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్, నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కాట్రపల్లిలో..

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలో మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎర్ర యాకూబ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. తొలుత యాకూబ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కొండూరులో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తాళ్లపెల్లి శ్రీనివాసరావును అతడి కుమార్తె ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా దయాకర్‌రావు పరామర్శించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహనాయక్, ప్రధాన కార్యదర్శి పూస మధు తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు..

సంగెం: మండలంలోని పలు కుటుంబాలకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. గవిచర్లలో గుళ్లపల్లి సాయిలు, గుళ్ళపల్లి కుమార్, ఎల్గూర్‌స్టేషన్‌లో బొల్ల కుమార్, ఎల్గూర్ రంగంపేటలో బోనాల కృష్ణమూర్తి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి, నాయకులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, రైతుబంధు మండల మాజీ కన్వీనర్ బొమ్మినేని మాధవరెడ్డి ఏడాది క్రితం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి పరామర్శించారు. అనంతరం గ్రామానికి చెందిన గౌస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, బీఆర్‌ఎస్ నాయకులు బోడకుంట్ల ప్రకాశ్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, సుంకరి శివ, తదితరులున్నారు.

కాంగ్రెస్ నాయకుల..

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన ఓ పత్రిక విలేకరి కొల్లూరి నాగరాజును అతడి కుమారుడు రేవంత్‌కుమార్ ఇటీవల జరిగిన ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ శుక్రవారం పరామర్శించారు. కార్యక్రమంలో పర్వతగిరి ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, నాయకులు సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురంలో..

ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన కుందనపెల్లి సోమక్క ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన బసవ కుమార్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : లక్నెపల్లిలో పీవీ విగ్రహానికి పూలమాల వేస్తున్న పెద్ది



నల్లబెల్లి : పీవీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పీవీ సేవలు మరువలేనివి

● ఘనంగా జయంతి వేడుకలు

సాక్షి నెట్‌వర్క్ : మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని పలు రాజకీయ పార్టీల నాయకులు కొనియాడారు. జిల్లాలోని నర్సంపేట, పర్వతగిరి, రాయపర్తి, నల్లబెల్లి, తదితర మండలాల్లో ఆయన 103వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీవీ.విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పర్వతగిరి : నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రాయపర్తిలో..

పంచాయతీలో నిధుల దుర్వినియోగం



వినతిపత్రం ఇస్తున్న ప్రవీణ్‌కుమార్, తదితరులు

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరుగుతోందని మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రైవేట్ వ్యక్తులు చేస్తున్న అభివృద్ధి పనులు, నిధుల వివరాలు అందించాలని కోరుతూ ఆయన ఆధ్వర్యంలో గత పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి రజితకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. గత పాలకవర్గానికి, గ్రామస్తులకు తెలియకుండా ప్రైవేట్ వ్యక్తులతో అవసరం లేని పనులకు నిధులు దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. గత పాలకవర్గ సభ్యులు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించడం లేదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గత పాలకవర్గ బాధ్యులకు, ప్రస్తుత ఎంపీటీసీకి సమాచారం ఇవ్వకుండా చేపట్టారని చెప్పారు. మండల పరిధిలోని ఓ అధికారి, గ్రామ పరిధి అధికారి నిధుల వినియోగంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుభానీబీ, రమ, మనెమ్మ, సుదర్శన్, నజీయ, హైమ, జమాల్, సఫియా, వెంకన్న, భాగ్యలక్ష్మి, రవి, లచ్చయ్య, యాకూబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ నిర్మాణ పనుల అడ్డగింత



బ్రిడ్జి నిర్మాణం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

నెక్కొండ : మండలంలోని గుండ్రపల్లిలోని రైల్వే గేటు వద్ద చేపట్టిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణ పనులను ఆ గ్రామ రైతులు శుక్రవారం అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు సకాలంలో పూర్తి కాక తాము ఇబ్బందుల పాలవుతున్నామని చెప్పారు. సుమారు ఏడాదిగా పనులు సాగుతున్నాయని తెలిపారు. దాదాపు 4, 5 నెలల్లో పనులు పూర్తి చేస్తానని సదరు కాంట్రాక్టర్ రైతులకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేయకుండా పనులు చేపట్టగా పనులు పూర్తి కాక వ్యవసాయ పనుల కోసం పంట చేళ్ల వద్దకు వెళ్లలేక పోతున్నామని వాపోయారు. అధికారులు తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా చొరవ చూపాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సదరం క్యాంపులో 60 మందికి పరీక్షలు

● 60 మందికి నిర్ధారణ పరీక్షలు



వివరాలను సేకరిస్తున్న వైద్యాధికారులు

రాయపర్తి (వర్ధన్నపేట) : పట్టణంలోని సీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన సదరం క్యాంపు సక్సెస్ అయ్యింది. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 60 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ నర్సింహస్వామి తెలిపారు. అర్హులైన దివ్యాంగులందరికీ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి సర్టిఫికెట్‌లు అందజేస్తామని ఆయన చెప్పారు. శిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ చందునాయక్, నర్సింహారెడ్డి, వేణు, భరత్, వీరయ్య, డీఆర్‌డీపీ సదరం విభాగం అధికారులు శైలజ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పోషయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చరిత్ర, కంప్యూటర్ అప్లికేషన్, కంప్యూటర్ సైన్స్, గణిత శాస్త్రం పోస్టుల్లో అధ్యాపకులను నియమించనున్నట్లు చెప్పారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు కనీస అర్హతగా ఉండాలని తెలిపారు. నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వివరించారు. జూలై 4న ఉదయం 11 గంటలకు వరంగల్ రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 7386321745లో సంప్రదించాలని సూచించారు.

సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం నిలిపేయాలి

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురంలో చేతిపంపు వద్ద రెవెన్యూ ఉద్యోగి మండల నర్సింహస్వామి చేపట్టిన సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాన్ని నిలిపేయాలని ఎంపీడీఓ అంబటి శ్రీధర్‌రాజు ఆదేశించారు. ఫిర్యాదు అందిన నేపథ్యంలో నిర్మాణ పనులను ఎంపీడీఓ శుక్రవారం పరిశీలించి విచారణ చేపట్టారు. కాగా సెప్టిక్ ట్యాంక్ నిర్మాణంపై జరిగిన వివాదంపై స్థానిక ఎస్సై గూడ అరుణ్‌కుమార్ విచారణ చేశారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు రాజు షకీల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

నల్లబెల్లి : మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యాబోధనపై శుక్రవారం రెండో రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఝాన్సీ రాణి, రమ మాట్లాడారు. ప్రీస్కూల్ చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలని సూచించారు. ఆరేళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పూర్వప్రాథమిక విద్యాబోధనను అమలు చేస్తోందని తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేటలోని తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు శుక్రవారం నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ తహసీల్దార్ కార్యాలయంలో గిర్దావర్ వెంకట్‌రెడ్డిపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయగా నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిర్దావర్ కృష్ణస్వామి, ఏఎస్ఓ రాజు, సీనియర్ అసిస్టెంట్ రమేశ్, జూనియర్ అసిస్టెంట్ పోషయ్య, అశోక్, రికార్డు అసిస్టెంట్లు సంపత్, నరేశ్, వీఆర్ఏ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామానికి చెందిన గంధం రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక గౌడ యువజన సంఘం నాయకులు సంఘం తరపున శుక్రవారం రూ.5 వేల సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యకుడు చీకటి రాజశేఖర్, నాయకులు పులి రమేశ్, కొంకాల గౌతమ్, తండ రమేశ్, వర్దెల్లి నరేశ్, కొంకాల అజిత్, అనిల్, నందు, గంధం రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ పూజలు



ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలోని శివరామ క్షేత్రంలో మొదటి వార్షికోత్సవ పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ 108 కలశాలతో అభిషేకాలు, రుద్రహోమాలు, సీతారాములు, శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరాజ్ కుమార్ శర్మ, ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేలకూలిన భారీ వృక్షం



దుగ్గొండి : గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి, వీచిన గాలులకు మండలంలోని గిర్నిబావి–నాచినపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకూలింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై జక్కుల పరమేశ్ పోలీసు సిబ్బందితో శుక్రవారం తెల్లవారుజామున చేరుకుని జేసీబీ సాయంతో వృక్షాన్ని తొలిగించారు. దీంతో రాకపోకలు కొనసాగాయి.

మొక్కలు నాటి సంరక్షించాలి



నర్సంపేట : సమాజంలోని ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించి వృక్షాలు, అడవుల అభివృద్ధికి పాటుపడాలని స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు, సామాజిక సేవకుడు బెజ్జంకి ప్రభాకర్ కోరారు. ప్రపంచ వృక్ష దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆ సంస్థ కార్యాలయ ఆవరణలో ఆయన శుక్రవారం మామిడి, జామ మొక్కలను నాటి మాట్లాడారు. మొక్కలు నాటి ప్రకృతిని కాపాడి భావితరాలకు మంచి భవిష్యత్తును అందించాలని ఆకాంక్షించారు.

మోడల్ స్కూల్లో 1న స్పాట్ అడ్మిషన్లు

సంగెం : మండలంలోని గవిచర్ల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో జూలై 1న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ముజీబుర్ రెహ్మాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్‌లోని 6 , 7, 9, 10వ తరగతుల్లో ఉన్న ఖాళీల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు జూలై 1న ఉదయం 10 గంటలకు స్కూల్‌లో అర్హత పత్రాలతో సంప్రదించాలని సూచించారు.

నియామకం



దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం శివారు మంగలితండాకు చెందిన ధరావత్ వీరస్వామి నాయక్ లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు వీరస్వామికి రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్, చీఫ్ కోఆర్డినేటర్ రమేశ్‌నాయక్ శుక్రవారం నియామక పత్రం అందజేశారు. అనంతరం వీరస్వామి మాట్లాడారు. తనను నియమించిన రాజ్‌కుమార్ జాదవ్, రమేశ్‌నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. లంబాడీలు విద్య, ఉద్యోగం, రాజకీయ, ఇతర అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా లంబాడీ యువతను చైతన్యం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.

కిరాణా షాపుల్లో పోలీసుల తనిఖీ



రాయపర్తి (వర్ధన్నపేట) : ప్రభుత్వం నిషేధించిన గుట్కా, అంబర్, తదితర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. వర్ధన్నపేటలోని పలు కిరాణా, పాన్ షాపుల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గుట్కా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో పోలీసులు పిట్ట రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ తల్లి బోనాలు



పూజలు చేస్తున్న ముదిరాజ్ కులస్తులు

నల్లబెల్లి : మండలంలోని బొల్లోనిపల్లిలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లి బోనాల పండుగను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తుల కోలాహలం నెలకొంది. పిల్లలు, పెద్దలు పెద్దమ్మతల్లికి మొక్కులు అప్పజెప్పేందుకు పోచంపల్లి శివారులోని ఆలయానికి బోనంతో ఊరేగింపుగా తరలివెళ్లారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. మహిళలు బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సొసైటీ చైర్మన్ సిద్ధ సంతోశ్, మాజీ చైర్మన్ బండి సారయ్య, కుల పెద్దలు పోలుదాసరి చిన్న భద్రయ్య, పోలుదాసరి రమేశ్ (రంగన్న), భూమ సురేశ్, పోలుదాసరి రమేశ్, భూమ సురేశ్, రెడ్డి రాజయ్య, బోయిని రవి, కల్వాల సుధాకర్, పోలుదాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విభేదాలు సృష్టించేందుకు యత్నించడం సరికాదు

ముదిరాజ్ కుల సంఘంలో విభేదాలు సృష్టించేందుకు యత్నించడం సరికాదని ముదిరాజ్ సొసైటీ చైర్మన్ సిద్ధ సంతోశ్ అన్నారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ కుల సంప్రదాయాలకు కొందరు వ్యక్తులు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించారని తెలిపారు. వంశపారంపర్యంగా పెద్దమ్మతల్లి బోనాల పండుగను ఏటా ఆరేద్ర కార్తెలో తొలి శుక్రవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంఘంలోని కొందరు విభేదాలు సృష్టించేందుకు, సంప్రదాయానికి విరుద్ధంగా బోనాల పండుగను జరిపేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. సంఘంలో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నించిన వ్యక్తులు పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆర్డీఓ కృష్ణవేణికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లోని అన్ని ఉపాధ్యాయ ఖాళీలతోపాటు ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నాల శివకుమార్, కార్యకర్తలు ఆది, సూర్యతేజ, హేమంత్, సిద్ధూ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులతో నాగరాజు, తదితరులు



హెచ్‌ఎంకు పుస్తకాలు అందిస్తున్న కవిత

నల్లబెల్లి : మండలంలోని కొండాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయుడు కందకట్ల నాగరాజు రూ.10 వేల విలువైన నోట్‌బుక్కులను అందించగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నక్కిరెడ్డి మహేందర్‌రెడ్డి, మేడేపల్లి హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అంకం కృష్ణమూర్తి శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం మహేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి మాట్లాడారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేలా ఉపాధ్యాయుడు నాగరాజు పుస్తకాలు అందించడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం అసోసియేట్ మండల అధ్యక్షుడు పేరాల మల్లయ్య, నాయకులు దూపటి కృష్ణమూర్తి, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస రాజు, ఉపాధ్యాయులు బానోత్ కృష్ణ, జ్యోతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మేడేపల్లి హైస్కూల్‌కు..

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని జేడీ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ కవిత తెలిపారు. మండలంలోని మేడేపల్లి హైస్కూల్‌కు ఆమె శుక్రవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 100 పుస్తకాలు బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కృష్ణమూర్తికి ఆమె పుస్తకాలు అందించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఫౌండేషన్ తోడ్పాటు అందిస్తుందని తెలిపారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థినులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తున్న ఎంపీపీ, తదితరులు

సంగెం : విద్యార్థినులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ కళావతి చెప్పారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు ఆమె శుక్రవారం పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫారాలు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థినులకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. కష్టపడి చదువుకుని ఉన్నతంగా ఎదగాలని చెప్పారు. పదో తరగతి విద్యార్థినులందరూ 10 జీపీఏ సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, ఏపీఎం కిషన్, ప్రత్యేకాధికారి నీలిమ, టీచర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

రాయపర్తి(వర్ధన్నపేట): కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. వర్ధన్నపేట బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయామని అధైర్యపడొద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ఇప్పటికే విఫలమైందన్నారు. త్వరలోనే నియోజకవర్గ ముఖ్యకార్యకర్తలను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కల్పిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, ఎంపీపీ అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.